TGTEL/25/A4812

వాయిస్ ఆఫ్

# వందే భారత్

Voice of Vande Bharath

తెలుగు దినపత్రిక

సంపుటి : 01| సంచిక : 73 | పేజీలు : 04| వెల: రూ.3/- తెలంగాణ శుక్రవారం | జూన్ 26, 2026


2లో..

## ప్రపంచ వ్యాప్తంగా డిజిటల్ విప్లవం

- ఆర్థిక సమ్మిళితం, డిజిటల్ పురోగతి
- ప్రజల జీవన ప్రమాణాల పెంపు
- డిజిటల్ పురోగతితో ఆర్థిక సాధికారత
- ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వెల్లడి
- నెదర్లాండ్స్ క్వీన్ మాక్సిమాతో భేటీ
- డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై చర్చ

**న్యూఢిల్లీ, వాయిస్ ఆఫ్ వందే భారత్:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ప్రత్యేక ప్రతినిధి (ఫైనాన్షియల్ హెల్త్), నెదర్లాండ్స్ రాణి అయిన క్వీన్ మాక్సిమా గురువారం న్యూఢిల్లీలో సమావేశమయ్యారు. వీరిద్దరి మధ్య జరిగిన ఈ కీలక భేటీలో, భారతదేశంలో డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ద్వారా ఆర్థిక సేవలు సామాన్యులకు ఏ విధంగా మరింత సులభంగా, సరసమైన ధరల్లో అందుబాటులోకి వచ్చాయనే అంశంపై ప్రధానంగా చర్చలు జరిగాయి. ఈ డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు సామాన్య పౌరుల జీవన ప్రమాణాలను ఏ విధంగా మారుస్తున్నాయో ఇద్దరు నేతలూ సుదీర్ఘంగా సమీక్షించారు. ధాని మోదీ తన (ట్విట్టర్) ఖాతా ద్వారా ఈ సమావేశం గురించి వివరిస్తూ, ఆర్థిక సమ్మిళితంలో ప్రపంచవ్యాప్తంగా బలమైన గొంతుకగా ఉన్న క్వీన్ మాక్సిమాను కలవడం సంతోషంగా ఉందని తెలిపారు. భారతదేశంలో ఆధార్, యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ , ప్రధాన మంత్రి జన్-ధన్ యోజన వంటి డిజిటల్ పబ్లిక్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా నడిచే డిజిటల్ విప్లవం.. ప్రజల జీవన ప్రమాణాల్ని ఏ విధంగా పెంచుతోందో వారు చర్చించారు. ఈ డిజిటల్ విధానాలు లక్షల మంది ప్రజలకు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారికి, ఆర్థిక సాధికారత కల్పిస్తున్నాయని ఆయన ఈ సందర్భంగా వివరించారు. భారతదేశం సాధించిన ఈ సాంకేతిక, ఆర్థిక సమ్మిళిత అనుభవాలను ప్రపంచంలోని ఇతర భాగస్వామ్య దేశాలతో పంచుకోవడానికి భారత్ ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. అభివృద్ధి చెందుతున్న, పేద దేశాలకు భారతదేశ మోడల్ ఒక ఖర్చు-తక్కువ, సులభతరమైన మార్గదర్శకంగా నిలుస్తుందని భారత ప్రభుత్వం పదేపదే తెలియజేస్తోంది. ఐక్యరాజ్యసమితి ఫైనాన్షియల్ హెల్త్ అడ్వకేట్‌గా తన మూడు రోజుల భారత పర్యటనలో భాగంగా క్వీన్ మాక్సిమా.. ముంబై, న్యూఢిల్లీలను సందర్శించారు. మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ, భారతదేశం ఆర్థిక సమ్మిళితం, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో అద్భుతమైన ప్రగతిని సాధించిందని ప్రశంసించారు. ఒకప్పుడు కేవలం బ్యాంకింగ్ సేవలు అందించడం పైనే దృష్టి ఉండగా, ఇప్పుడు ఈ సాంకేతికతను ఉపయోగించి ప్రజల వాస్తవ ఆర్థిక ఆరోగ్యాన్ని ఎలా మెరుగుపరచాలన్నది ప్రధాన అంశంగా మారిందని ఆమె అన్నారు. ముంబై పర్యటనలో క్వీన్ మాక్సిమా కొందరు సాధారణ ప్రజలు, నర్సులు, యువతతో ముఖాముఖి చర్చలు జరిపారు. వారు తమ ఆర్థిక నిర్వహణ, బడ్జెటింగ్, పొదుపు కోసం డిజిటల్ యాప్‌లను ఎలా ఉపయోగిస్తున్నారో స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అట్టడుగు వర్గాల ప్రజలకు బ్యాంకింగ్ సేవలను ఉచితంగా అందించే 'జన్ ధన' పథకం లబ్ధిదారులతో కూడా ఆమె ముచ్చటించి వారి సాధక బాధకాలను విన్నారు. డిజిటల్ చెల్లింపులు, సబ్సిడీల నేరు బదిలీ వంటి కార్యక్రమాలతో భారతదేశం ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షిస్తోంది. భవిష్యత్తులో అందరికీ సురక్షితమైన, అనుకూలమైన ఆర్థిక వ్యవస్థను సృష్టించడంలో క్వీన్ మాక్సిమా, ప్రధాని మోదీ మధ్య జరిగిన ఈ చర్చలు అత్యంత ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి.

## తెలంగాణ కొత్త సీఎస్‌గా ఐఏఎస్ సంజయ్ జాజు

- ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం
- 1992 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి
- జూన్ 30తో ముగియనున్న రామకృష్ణారావు పదవీ కాలం


2లో..

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్:** తెలంగాణ రాష్ట్ర పరిపాలనా యంత్రాంగంలో అత్యున్నత స్థాయిలో ఒక కీలక మార్పు చోటుచేసుకుంది. రాష్ట్ర నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా 1992 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి సంజయ్ జాజు నియమితులయ్యారు. ప్రస్తుతం సీఎస్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న కె. రామకృష్ణారావు సుదీర్ఘ పదవీ కాలం పొడిగించిన గడువుతో సహా జూన్ 30తో ముగియనుంది. అదే రోజున సంజయ్ జాజు రాష్ట్ర అత్యున్నత బ్యూరోక్రాటిక్ పదవిని స్వీకరించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక అభ్యర్థన మేరకు కేంద్ర కేబినెట్ నియామకాల కమిటీ ఆయన్ను కేంద్ర సర్వీసుల నుండి రిలీవ్ చేసి మాతృ కేడర్‌కు పంపిన మరుసటి రోజే ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి. సంజయ్ జాజుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు కేంద్రంలోనూ అత్యంత సమర్థుడైన అధికారిగా పేరుంది.

## మరో నాలుగు చెరువుల పునరుద్ధరణ

- 107 కోట్లతో చేపట్టిన హైడ్రా


2లో..

## రాష్ట్రంలో పలువురు ఐఏఎస్‌ల బదిలీ

- సీఎంఓ నుంచి అజిత్ రెడ్డి ఔట్
- కొత్తగా ఇన్వెస్ట్ తెలంగాణ సీవీవోగా నియామకం
- సీఎంవో ముఖ్య కార్యదర్శిగా ఎన్. శ్రీధర్
- జీఏడీ ప్రధాన కార్యదర్శిగా అహ్మద్ నదీమ్
- అటవీశాఖ ముఖ్య కార్యదర్శిగా శైలజా రామయ్యర్



2లో..

## ఎల్‌నినోతో తక్కువ వర్షపాతం



2లో..

- కేంద్రం తాజా అంచనాలు
- దేశంలో తక్కువ వర్షపాతం..
- 315 జిల్లాలపై కేంద్రం ప్రత్యేక నిఘా
- అత్యవసర ప్రణాళికలు సిద్ధం చేయాలి
- రాష్ట్రాలకు కేంద్ర వ్యవసాయ శాఖ ఆదేశం

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF VANDE BHARATH
శుక్రవారం, జూన్ 26, 2026

## మరో నాలుగు చెరువుల పునరుద్ధరణ

- 107 కోట్లతో చేపట్టిన హైడ్రా
- ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు, కాముని చెరువుల వద్ద భూమి పూజ చేసిన కమిషనర్ రంగనాథ్




**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** నగరంలో వరదల కట్టడి, భూగర్భ జలాల పెంపే లక్ష్యంగా హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీచెరువుల పునరుద్ధరణకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా రూ. 107 కోట్ల భారీ వ్యయంతో మరో నాలుగు ప్రముఖ చెరువుల అభివృద్ధి పనులను హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్ అధికారికంగా ప్రారంభించారు. ఇబ్రహీంపట్నంలోని పెద్ద చెరువు, కాముని చెరువుల వద్ద ఆయన స్వయంగా భూమి పూజ చేసి పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. హైడ్రా చేపట్టిన ఈ పునరుద్ధరణ జాబితాలో ఇబ్రహీం పెద్ద చెరువు, భగీరథమ్మ చెరువు, కాముని చెరువు, కాప్రా చెరువులు ఉన్నాయి. మొత్తం 311 ఎకరాల భారీ విస్తీర్ణంలో ఉన్న ఈ నాలుగు చెరువులను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేలా పక్కా ప్రణాళికను సిద్ధం చేశారు. వీటిని కేవలం జలాశయాలుగానే కాకుండా, స్థానికులకు ఆహ్లాదాన్ని పంచే అద్భుతమైన పర్యాటక కేంద్రాలుగా మార్చనున్నారు. ఇందులో భాగంగా చెరువుల చుట్టూ వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్‌లు, పిల్లల కోసం ప్రత్యేక ప్లే ఏరియాలను ఏర్పాటు చేయనున్నారు. వీటితో పాటు పెద్ద చెరువుల్లో పర్యాటక శాఖ సహకారంతో త్వరలోనే బోటింగ్ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

# ఎల్‌నినోతో తక్కువ వర్షపాతం

- కేంద్రం తాజా అంచనాలు
- దేశంలో తక్కువ వర్షపాతం..
- 315 జిల్లాలపై కేంద్రం ప్రత్యేక నిఘా
- అత్యవసర ప్రణాళికలు సిద్ధం చేయాలి
- రాష్ట్రాలకు కేంద్ర వ్యవసాయ శాఖ ఆదేశం




**న్యూఢిల్లీ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ఎల్ నినో ప్రభావం కారణంగా దేశంలో సాధారణం కంటే తక్కువగా వర్షాలు కురిసే 315 జిల్లాలను కేంద్ర వ్యవసాయ శాఖ గుర్తించింది. ఈ జిల్లాలు కలిగిన ఆయా రాష్ట్రాలు తమ అత్యవసర ప్రణాళికలను అమలు చేయాలని ఆదేశించింది. ఈ 315 జిల్లాల్లో 25 శాతం కంటే తక్కువ సాగునీటి వసతి కలిగిన 111 జిల్లాలను అత్యంత ప్రమాదకమైన కేటగిరీగా గుర్తించారు. 25 నుంచి 50 శాతంలోపు సాగునీటి వసతి ఉన్న మరో 76 జిల్లాలను మధ్యస్థ ప్రమాదకర కేటగిరీలో చేర్చగా, 50 శాతం కంటే ఎక్కువ సాగునీటి సౌకర్యం ఉన్న 128 జిల్లాలను సాపేక్షంగా తక్కువ ముప్పు ఉన్న ప్రాంతాలుగా పరిగణించారు. అత్యంత ప్రమాదకర స్థితిలో ఉన్న జిల్లాలు ఎక్కువగా మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లలో కేంద్రీకృతమై ఉన్నాయి. మిగిలిన జిల్లాలు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, కర్ణాటక, బీహార్, జార్ఖండ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లో విస్తరించి ఉన్నాయి. బలహీనమైన



రుతుపవనాల ప్రభావాన్ని తట్టుకునేందుకు పప్పు ధాన్యాలు, చిరుధాన్యాలు, నూనె గింజల సాగువైపు రైతులను ప్రోత్సహించాలని కేంద్రం రాష్ట్రాలకు సూచించింది. పంటల వైవిధ్యం, తేమ సంరక్షణ, సమర్థవంతమైన నీటి యాజమాన్యం వంటి వ్యూహాలను అనుసరించాలని తెలిపింది. చెరువుల మరమ్మతులు, చెక్ డ్యామ్‌ల పునరుద్ధరణ, కాలువల్లో పూడికతీత, నీటి సంరక్షణ నిర్మాణాల విస్తరణ ద్వారా నీటి నిల్వ సామర్థ్యాన్ని బలోపేతం చేయాలని రాష్ట్రాలను ఆదేశించింది. మరోవైపు 2026 ద్వితీయార్థంలో ఎల్ నినో తీవ్ర రూపం దాల్చే అవకాశం ఉందని ఐక్యరాజ్యసమితి వాతావరణ సంస్థ హెచ్చరించింది. 'సౌత్ ఏషియన్ ?`లకెమేట్ అవుట్ లుక్ ఫోరం' అంచనాల ప్రకారం భారతదేశంలో దీర్ఘకాలిక సగటు వర్షపాతంలో కేవలం 90 శాతం మాత్రమే కురిసే అవకాశం ఉంది. తీవ్రమైన ఉష్ణోగ్రతలు, నీటి ఎద్దడి కారణంగా సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఎల్ నినో వల్ల అనావృష్టి ఏర్పడి ఆహార ద్రవ్యోల్బణం పెరిగిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించింది.

# తెలంగాణ కొత్త సీఎస్‌గా ఐఏఎస్ సంజయ్ జాజు

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్:** తెలంగాణ రాష్ట్ర పరిపాలనా యంత్రాంగంలో అత్యున్నత స్థాయిలో ఒక కీలక మార్పు చోటుచేసుకుంది. రాష్ట్ర నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా 1992 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి సంజయ్ జాజు నియమితులయ్యారు. ప్రస్తుతం సీఎస్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న కె. రామకృష్ణారావు సుదీర్ఘ పదవీ కాలం పొడిగించిన గడువుతో సహా జూన్ 30తో ముగియనుంది. అదే రోజున సంజయ్ జాజు రాష్ట్ర అత్యున్నత బ్యూరోక్రాటిక్ పదవిని స్వీకరించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక అభ్యర్థన మేరకు కేంద్ర కేబినెట్ నియామకాల కమిటీ ఆయన్ను కేంద్ర సర్వీసుల నుండి రిలీవ్ చేసి మాతృ కేడర్‌కు పంపిన మరుసటి రోజే ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి.సంజయ్ జాజుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు కేంద్రంలోనూ అత్యంత సమర్థుడైన అధికారిగా పేరుంది. 1992 బ్యాచ్ తెలంగాణ కేడర్ ఐఏఎస్ అధికారి అయిన ఆయన.. గతంలో ఉమ్మడి ఏపీలో ఐటీ డిపార్ట్‌మెంట్ సెక్రటరీగా పనిచేసినప్పుడు నేటికీ ప్రజలకు అందుబాటులో ఉన్న విప్లవాత్మక డిజిటల్ సేవలైన మీసేవ , మున్సిపల్ పరిధిలో సౌకర్యం ప్రాజెక్టులను డిజైన్ చేసి అమలు చేసిన ఘనత సాధించారు. అంతేకాకుండా, గతంలో ఉమ్మడి హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా, తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్‌గా, విభజన తర్వాత ఢిల్లీలోని తెలంగాణ భవన్ ప్రతినిధిగా పలు హోదాల్లో సేవలందించి క్షేత్రస్థాయి పరిపాలనపై తిరుగులేని పట్టు సాధించారు.సంజయ్ జాజు గత 13 ఏళ్లుగా కేంద్ర సర్వీసుల్లో డెప్యుటేషన్‌పై అత్యంత కీలక బాధ్యతలు నిర్వర్తించారు. కేంద్ర రక్షణ ఉత్పాదక శాఖ , కేంద్ర సమాచార–ప్రసారాల శాఖ సెక్రటరీగా దేశ డిజిటల్, రక్షణ రంగాల విధాన నిర్ణయాల్లో ఆయన కీలక పాత్ర పోషించారు. తెలంగాణకు తిరిగి వచ్చే ముందు ఆయన కేంద్ర ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. కేంద్రంలో సుదీర్ఘ కాలం పనిచేయడం వల్ల ఢిల్లీ సర్కిళ్లలో గల ఉన్నతాధికారులు, వివిధ మంత్రిత్వ శాఖలతో ఆయనకు ఉన్న బలమైన నెట్‌వర్క్ రాష్ట్ర ప్రయోజనాలకు ఎంతగానో ఉపయోగపడనుందని సచివాలయ వర్గాలు భావిస్తున్నాయి.ప్రస్తుత సీఎస్ రామకృష్ణారావు పదవీ విరమణ తరుణంలో రేసులో జయేష్ రంజన్, వికాస్ రాజ్ వంటి పలువురు సీనియర్ల పేర్లు వినిపించినప్పటికీ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మాత్రం సంజయ్ జాజు వైపే మొగ్గు చూపారు. దీనికి ప్రధాన కారణం ఆయనకున్న క్లీన్ ఇమేజ్ , వివాదరహిత ట్రాక్ రికార్డ్. రాష్ట్రంలో గుణాత్మక మార్పులు, పాలనా సంస్కరణలు తేవాలని భావిస్తున్న రేవంత్ రెడ్డికి.. ఐటీ, డిజిటల్ పరిపాలనలో ఎక్స్‌పర్ట్ అయిన జాజు అయితేనే కరెక్ట్ అని భావించారు. దాదాపు 13 ఏళ్ల తర్వాత మాతృ రాష్ట్రానికి తిరిగి వస్తున్న సంజయ్ జాజుకు సీఎస్‌గా బాధ్యతలు స్వీకరించగానే పలు సవాళ్లు ఎదురుకానున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న గ్యారెంటీల అమలు, రాష్ట్ర ఆర్థిక వనరుల సమీకరణ, పారిశ్రామిక అభివృద్ధి, నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి పరిపాలనా యంత్రాంగాన్ని పరుగులు పెట్టించాల్సి ఉంటుంది. ఒకవైపు ఐటీ విజనరీగా, మరోవైపు కఠినమైన టాస్క్ మాస్టర్‌గా పేరు తెచ్చుకున్న సంజయ్ జాజు.. రాబోయే రోజుల్లో తెలంగాణ బ్యూరోక్రసీని ఏ విధంగా లీడ్ చేస్తారనేది సచివాలయ ఉద్యోగ వర్గాల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది.

# రాష్ట్రంలో పలువురు ఐఏఎస్‌ల బదిలీ

- సీఎంఓ నుంచి అజిత్ రెడ్డి ఔట్
- కొత్తగా ఇన్వెస్ట్ తెలంగాణ సీఈవోగా నియామకం
- సీఎంవో ముఖ్య కార్యదర్శిగా శ్రీధర్
- జీఏడీ ప్రధాన కార్యదర్శిగా అహ్మద్ నదీమ్
- అటవీశాఖ ముఖ్య కార్యదర్శిగా శైలజా రామయ్యర్




**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తెలంగాణ రాష్ట్ర పాలనా విభాగంలో ప్రభుత్వం పెద్ద ఎత్తున మార్పులు చేర్పులు చేపట్టింది. పరిపాలనను మరింత వేగవంతం చేసే దిశగా కీలక నిర్ణయం తీసుకుంటూ ఒకేసారి 13 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ తాజా బదిలీలలో భాగంగా ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారి ఎన్. శ్రీధర్‌ను నియమించారు. అలాగే ఇప్పటివరకు సీఎంఓలో సేవలందించిన అజిత్‌రెడ్డిని అక్కడి నుంచి బదిలీ చేసి, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓగా కొత్త బాధ్యతలను అప్పగించారు. జీఏడీ ప్రధాన కార్యదర్శిగా అహ్మద్ నదీమ్ నియమితులు అయ్యారు. ఈ క్రమంలోనే పలువురు సీనియర్ అధికారులకు అదనపు బాధ్యతలను కూడా కేటాయించింది. విపత్తు నిర్వహణ శాఖ ముఖ్య కార్యదర్శిగా రాహుల్ బొజ్జా నియమితులు కాగా.. ఆయనకు బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శిగా అదనపు బాధ్యతలను అప్పగించారు. అటవీశాఖ ముఖ్య కార్యదర్శిగా శైలజా రామయ్యర్‌ను నియమించగా.. దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. చేనేత, హస్తకళల ప్రత్యేక కార్యదర్శిగా ఉన్న సవ్యసాచి ఘోష్‌కు ఆ శాఖలోనే మరికొన్ని అదనపు బాధ్యతలను కేటాయించగా.. అదే శాఖకు జాయింట్ సెక్రటరీగా కాత్యాయనీ దేవిని నియమించారు. గనులశాఖ ముఖ్య కార్యదర్శిగా రఘునందన్‌రావుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. అలాగే.. హెచఎండీఏ జాయింట్ కమిషనర్‌గా కె. చంద్రకళను, తెలంగాణ రెడ్‌కో చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ముషారఫ్ అలీని నియమించారు. ఆరఅండ్‌బీ స్పెషల్ సెక్రటరీగా గంగాధర్‌కు బాధ్యతలు అప్పగించారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కొత్త కమిషనర్‌గా టి.వెంకన్నను నియమించారు. రాష్ట్ర పర్యాటక రంగ అభివృద్ధికి అత్యంత కీలకమైన టూరిజం డైరెక్టర్‌గా కె.విద్యాసాగర్‌ను నియమించారు. తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. జూన్ 30న పదవీ విరమణ చేయనున్న సీనియర్ ఐఏఎస్ అధికారి కె. రామకృష్ణారావును ముఖ్యమంత్రికి అడ్వైజర్ / ఎక్స్`ఆఫిషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీగా నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీఓ ఆర్టీ నెం. 912 జారీ చేసింది. ఈ నియామకానికి సంబంధించిన నిబంధనలు, షరతులను విడిగా జారీ చేస్తామని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

వాయిస్ ఆఫ్ వందే భారత్
Voice of Vande Bharath
VOICE OF VANDE BHARATH
శుక్రవారం, జూన్ 26, 2026

# ప్రజాస్వామ్య పరిరక్షణలో బీఎల్ఏల పాత్ర కీలకం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- వేములవాడలో బూత్ లెవల్ ఏజెంట్లకు ఎస్ఐఆర్ పై అవగాహన
- అభివృద్ధిని చూసి ఓర్వలేకే బీఆర్ఎస్ అసత్య ప్రచారాలు
- ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మండిపాటు



**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ప్రజాస్వామ్య పరిరక్షణలో బూత్ లెవల్ ఏజెంట్ల పాత్ర అత్యంత కీలకమని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం వేములవాడ పట్టణంలో వేములవాడ రూరల్ మండలం, పట్టణ పరిధికి చెందిన బీఎల్ఏలకు 'ప్రత్యేక ఓటరు జాబితా సవరణ' ప్రక్రియపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ఏజెంట్లకు సమగ్ర దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ... ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైన హక్కు అని, ప్రతి అర్హుడైన పౌరుడికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఓటరు జాబితాలో నూతన ఓట్ల నమోదు, అనర్హుల పేర్ల తొలగింపు, మార్పులు, చేర్పులు మరియు సవరణలు చట్టబద్ధంగా జరిగేలా బీఎల్ఏలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా ఏజెంట్లు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని, అవసరమైన ధ్రువీకరణ పత్రాలను సేకరించి దరఖాస్తులను సక్రమంగా పూర్తి చేయించాలని ఎమ్మెల్యే కోరారు. ప్రతి ఓటరు తమ పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో సరిచూసుకునేలా చూడాలన్నారు. కాంగ్రెస్ పార్టీ సర్పంచులు, నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు దీనిని ఒక సామాజిక బాధ్యతగా భావించి గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఎన్నికల సంఘం పరిశీలన జాబితాలో పెట్టిన అనుమానాస్పద ఓట్లకు సంబంధించి ఆయా ఓటర్లకు ముందే సమాచారం అందించి, ఫారాలను పూర్తి చేసి అధికారులకు సమర్పించేలా ప్రజలకు మార్గనిర్దేశం చేయాలని సూచించారు. వేములవాడ నియోజకవర్గ పరిధిలో కాంగ్రెస్ ప్రభుత్వం వేగంగా చేపడుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే బీఆర్ఎస్ నాయకులు ఆసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆది శ్రీనివాస్ మండిపడ్డారు. అనునిత్యం అబద్ధాలు చెప్తూ ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సోషల్ మీడియా ద్వారా మరియు క్షేత్రస్థాయిలో బీఆర్ఎస్ చేస్తున్న తప్పుడు ప్రచారాలను ఎప్పటికప్పుడు సమర్థవంతంగా తిప్పికొట్టాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ఈ అవగాహన కార్యక్రమంలో వేములవాడ రూరల్, పట్టణ పరిధికి చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, బూత్ లెవల్ ఏజెంట్లు పాల్గొన్నారు.

# తండా తండాలో కాంగ్రెస్ జెండా

- ఎమ్మెల్యే వంశీకృష్ణ, ఎమ్మెల్సీ శంకర్ నాయక్
- విజయవంతంగా సాగుతున్న 'ఇందిరమ్మ ఆశీర్వాద బస్సు యాత్ర'
- గిరిజనుల ఆత్మగౌరవాన్ని పెంచిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని హర్షం



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్:** "తండా తండాలో మా జెండా" నినాదంతో సాగుతున్న 'ఇందిరమ్మ ఆశీర్వాద బస్సు యాత్ర' నల్లమల అచ్చంపేట నియోజకవర్గంలో శుక్రవారం విజయవంతంగా కొనసాగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ... రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజనులు, లంబాడీల ఆత్మగౌరవం గణనీయంగా పెరిగిందన్నారు. 1976లో అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ గిరిజనులను ఎస్టీలుగా గుర్తించి వారికి చారిత్రాత్మక న్యాయం చేశారని గుర్తు చేశారు. భూ గరిష్ట పరిమితి చట్టం ద్వారా నిరుపేదలకు భూ పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లు, గిరిజన హాస్టళ్ల నిర్మాణం వంటివన్నీ కాంగ్రెస్ మార్కు పాలనతోనే సాధ్యమయ్యాయని స్పష్టం చేశారు. దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ... తండాలు, గిరిజన గూడాల్లో నివసించే నిరుపేదలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డుతో పాటు సన్న బియ్యం అందిస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ అని కొనియాడారు. గిరిజన పక్షపాతిగా ఉన్న ప్రజా ప్రభుత్వంపై ప్రతిపక్షాలు అనవసర విమర్శలు చేయడం తగదన్నారు. గత ప్రభుత్వ హయాంలో పేరుకుపోయిన అప్పుల కుప్పలను తీరుస్తూనే, సీఎం రేవంత్ రెడ్డి సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నారని తెలిపారు. గిరిజన విద్యార్థుల కోసం రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్' ప్రారంభించామని, విద్య, ఉద్యోగ రంగాల్లో ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్లను పకడ్బందీగా అమలు చేస్తున్నామని వివరించారు. మద్దిమడుగులో శ్రీ సద్గురు సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణానికి రూ. 169 కోట్లు, మన్ననూర్ పరిధిలో ఆదివాసీ భవన్ నిర్మాణానికి రూ. 5 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట వేసిందని నేతలు హర్షం వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గిరిజనులకు ఉన్న ఏజెన్సీ రిజర్వేషన్లను తొలగించేందుకు కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో జరుగుతున్న అభివృద్ధిని తట్టుకోలేక కొంతమంది బస్సు యాత్రను అడ్డుకోవాలని చూస్తే గిరిజన లోకం తగిన గుణపాఠం చెబుతుందని హెచ్చరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మరో పదేళ్ల పాటు అధికారంలో ఉండడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ ప్రతిష్టాత్మక బస్సు యాత్ర కార్యక్రమంలో రాష్ట్ర డిప్యూటీ స్పీకర్ రామచంద్రు నాయక్, కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాం నాయక్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, ఎమ్మెల్యేలు జాతోత్ రామచంద్రు నాయక్, మురళి నాయక్, లాఖావత్ సుభాష్ నాయక్, స్థానిక కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, గిరిజన సంఘాల నాయకులు, తండాల నుండి తరలివచ్చిన ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# పాఠశాలలు తెరిచి పది రోజులైనా అందని పాఠ్యపుస్తకాలు




**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్:** అచ్చంపేట పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు తక్షణమే మౌలిక వసతులు కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న పాఠ్యపుస్తకాలను వెంటనే పంపిణీ చేయాలని యునైటెడ్ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర నాయకులు ఎండీ సయ్యద్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని పలు ప్రభుత్వ వసతి గృహాలను యూఎస్ఎఫ్ఐ బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించి, విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకుంది. ఈ సందర్భంగా ఎండీ సయ్యద్ మాట్లాడుతూ... నూతన విద్యాసంవత్సరం ప్రారంభమై పది రోజులు గడుస్తున్నా, హాస్టళ్లలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని మండిపడ్డారు. విద్యార్థులకు ఇంకా పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు పంపిణీ కాకపోవడంతో వారు చదువుల్లో వెనుకబడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వసతి గృహాల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, పౌష్టికాహార భోజనాన్ని అందించాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించి యుద్ధప్రాతిపదికన పాఠ్యపుస్తకాల కొరతను తీర్చాలని, లేనిపక్షంలో విద్యార్థులను, వారి తల్లిదండ్రులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ తనిఖీలు, నిరసన కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ డివిజన్ కమిటీ సభ్యులు శివ, రాజు, మహేష్, వసతి గృహాల విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా మొహర్రం వేడుకలు



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్:** పవిత్ర మొహర్రం (పీర్ల పండుగ) ముగింపు వేడుకలను పురస్కరించుకుని అచ్చంపేట పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో భక్తులకు ఘనంగా పానకం పంపిణీ చేశారు. స్థానిక 'రామ్ రహీం లోకల్ ఆటో యూనియన్' ఆధ్వర్యంలో శుక్రవారం ఈ సేవా కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పీర్ల ఊరేగింపులో పాల్గొన్న వందలాది మంది భక్తులకు ఆటో కార్మికులు స్వయంగా పానకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రతినిధులు మాట్లాడుతూ... కులమతాలకు అతీతంగా, ఐక్యమత్యంతో గత 15 సంవత్సరాలుగా తమ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఇలాంటి అనేక సామాజిక, సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. మొహర్రం సందర్భంగా భక్తులకు పానకం పంపిణీ చేయడంతో పాటు, ప్రతి ఏటా శివభక్తులకు పండ్ల పంపిణీ, వృద్ధులకు అన్నదానం వంటి కార్యక్రమాలను సభ్యులందరి సమిష్టి సహకారంతో ఎంతో ప్రేమానురాగాలతో చేపడుతున్నామని వివరించారు. రామ్ రహీం లోకల్ ఆటో యూనియన్ అధ్యక్షులు మహబూబ్ అలీ, ముఖ్య అతిథి షాపూద్దీన్, మీడియా ఇన్‌చార్జి అన్వర్‌తో పాటు యూనియన్ సభ్యులు అశు, కాజా మియా, ఉస్మాన్, వెంకటేష్, ముస్తాక్, నిరంజన్, షౌకత్, శివ, శంకర్, హరి సింగ్, అశోక్, చందు, జాంగిర్, అక్బర్, శ్రీనివాసులు, అఖిల్, షబ్బీర్, అజ్జు, కాజా హెచ్‌డీఎన్, బురాన్, శ్రీనివాసాచారి, లక్ష్మయ్య, జహంగీర్, చాన్ తదితరులు పాల్గొన్నారు.

# ఇద్దరు ఎస్ఐల బదిలీ

**వరంగల్ , వాయిస్ ఆఫ్ వందే భారత్ :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు సబ్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలనా కారణాల దృష్ట్యా ఈ బదిలీలు చేపట్టినట్లు కమిషనరేట్ వర్గాలు తెలిపాయి. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు కొత్తగా అలాట్‌మెంట్ అయిన ఎస్ఐ వీరభద్ర రావుకు దామెర పోలీస్ స్టేషన్ ఎస్ఐగా బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం దామెర పోలీస్ స్టేషన్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న అశోక్‌ను అయినవోలు పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. బదిలీ అయిన అధికారులు వెంటనే తమకు కేటాయించిన కొత్త స్థానాల్లో బాధ్యతలు స్వీకరించాలని సీపీ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా రేగుల సంతోష్ బాబు



**వేములవాడ , వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాజన్న సిరిసిల్ల జిల్లా భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా వేములవాడ పట్టణానికి చెందిన ప్రముఖ నాయకుడు రేగుల సంతోష్ బాబు నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర నాయకత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. తన నియామకానికి సహకరించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచందర్ రావు, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గంధమల్ల ఆనంద్ గౌడ్, బీజేపీ జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి, రాష్ట్ర అధికార ప్రతినిధి, వేములవాడ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చెన్నమనేని వికాస్, బీజేపీ సీనియర్ నాయకులు ప్రతాప రామకృష్ణలకు రేగుల సంతోష్ బాబు ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం రేగుల సంతోష్ బాబు మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో రాజన్న సిరిసిల్ల జిల్లాలో భారతీయ జనతా పార్టీ, ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో వెనుకబడిన వర్గాల హక్కుల కోసం నిరంతరం శ్రమిస్తామని స్పష్టం చేశారు. సమాజంలో వెనుకబడిన వర్గాలకు రాజకీయంగా, సామాజికంగా దక్కాల్సిన వాటాను సాధించుకునేందుకు కృషి చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఓబీసీలకు అమలు చేయాల్సిన వివిధ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరేలా క్షేత్రస్థాయిలో రాజీలేని పోరాటాలు చేస్తామని సంతోష్ బాబు హెచ్చరించారు. పార్టీ బలోపేతానికి, ఓబీసీ మోర్చా విస్తరణకు ప్రతి కార్యకర్తను కలుపుకొని ముందుకు సాగుతానని ఆయన పేర్కొన్నారు. సంతోష్ బాబు నియామకం పట్ల జిల్లాలోని బీజేపీ శ్రేణులు, ఓబీసీ మోర్చా నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

## డ్రగ్స్ రహిత తెలంగాణే లక్ష్యం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- ఈగల్ ఫోర్స్ ఆధ్వర్యంలో భారీ అవగాహన ర్యాలీ
- డ్రగ్స్ బారిన పడితే '1908' టోల్ ఫ్రీ నెంబర్‌కు సంప్రదించాలి
- కలెక్టర్ గరిమ అగ్రవాల్



**రాజన్న సిరిసిల్ల, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం 'డ్రగ్స్ రహిత తెలంగాణ' సాధనే ఏకైక లక్ష్యంగా పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతోందని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం జిల్లా పోలీస్ శాఖ, ఈగల్ ఫోర్స్ ఆధ్వర్యంలో సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద భారీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు ఎస్పీ చంద్రయ్యతో కలిసి జెండా ఊపి ఈ భారీ ర్యాలీని ప్రారంభించారు. అంబేద్కర్ చౌరస్తా నుండి గాంధీ చౌక్ మీదుగా పద్మనాయక కల్యాణ మండపం వరకు ఈ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా పాఠశాలలు, సిరిసిల్ల నర్సింగ్ కళాశాల విద్యార్థులు మత్తు పదార్థాల వల్ల జరిగే నష్టాలపై ప్రదర్శించిన నాటికలు అందరినీ ఆలోచింపజేశాయి. అనంతరం విద్యార్థులు, యువతతో కలిసి అధికారులు డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ... రాష్ట్రంలో మాదకద్రవ్యాల మూలాలను పెకిలించి వేసేందుకు ప్రభుత్వం 'ఈగల్ ఫోర్స్' విభాగాన్ని ఏర్పాటు చేసి విస్తృతంగా దాడులు నిర్వహిస్తోందని తెలిపారు. యువత, విద్యార్థులు మత్తు పదార్థాల బాటను వీడి, మైదానం బాట పట్టాలన్న సీఎం రేవంత్ రెడ్డి పిలుపును అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. శాంతిభద్రతల నిర్వహణతో పాటు రోడ్డు భద్రత, హెల్మెట్, సీట్ బెల్ట్ ధారణపై కూడా అవగాహన కల్పిస్తున్న పోలీస్ శాఖను ఆయన అభినందించారు. యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించి అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వం స్పోర్ట్స్ యూనివర్సిటీని, నిరుద్యోగుల ఉపాధి కోసం స్కిల్ యూనివర్సిటీని ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిందన్నారు. జిల్లాలో 'సీఎం కప్' పోటీల ద్వారా గ్రామీణ క్రీడాకారులను వెలుగులోకి తెచ్చిన కలెక్టర్‌ను ఈ సందర్భంగా కొనియాడారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ... దేశ నిర్మాణంలో అత్యంత కీలకమైన యువశక్తి డ్రగ్స్ బారిన పడి పాడుకావద్దని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరికీ శారీరక, మానసిక ఆరోగ్యం అవసరమని, యువత ఖాళీగా ఉండకుండా తమకు నచ్చిన రంగాల్లో స్థిరపడాలని సూచించారు. ఎవరైనా మానసికంగా ఇబ్బంది పడితే సైకాలజిస్ట్‌లను సంప్రదించాలని, ఒకవేళ డ్రగ్స్‌కు బానిసైనట్లు గుర్తిస్తే జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఉన్న 'డీ-అడిక్షన్ కౌన్సెలింగ్ కేంద్రం'కు తరలించాలని కోరారు. జిల్లాలోని అన్ని గ్రామాలు, మున్సిపాలిటీలను డ్రగ్స్ రహితంగా మార్చేందుకు పక్కా కార్యాచరణతో ముందుకెళ్తున్నామని, మత్తు పదార్థాలను వ్యాప్తి చేసే వారిపై కఠిన చట్టాల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రగ్స్‌కు సంబంధించిన ఎలాంటి సమాచారం ఉన్నా ఈగల్ ఫోర్స్ టోల్ ఫ్రీ నంబర్ 1908, కంట్రోల్ రూం నంబర్ 8712671111 లేదా 112 నంబర్లను సంప్రదించి సేవలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ అవగాహన కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీఓ శ్రీధర్ బాబు, డీఎస్పీలు నాగేంద్రచారి, శ్రీనివాసులు, ఎస్‌బీ డీఎస్పీ వెంకటేశ్వర్లు, జిల్లా రవాణా అధికారి శ్రీనివాస్, తహసీల్దార్ మహేష్, పలువురు సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బిజినపల్లిలో గిరిజన ఆత్మగౌరవ మహాయాత్ర

- లంబాడి, ఎరుకల, యానాది కులాల భారీ బహిరంగ సభ
- గిరిజనులను ఎస్టీలుగా గుర్తించిన ఘనత ఇందిరాగాంధీదే
- ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్:** నాగర్‌కర్నూల్ జిల్లా బిజినపల్లి పట్టణ కేంద్రంలో లంబాడి, ఎరుకల, యానాది కులాల ఆధ్వర్యంలో నిర్వహించిన చారిత్రాత్మక గిరిజన 'ఆత్మగౌరవ మహాయాత్ర', భారీ బహిరంగ సభ అత్యంత ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి అచ్చంపేట శాసనసభ్యులు డా.చిక్కుడు వంశీకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సభకు తరలివచ్చిన గిరిజన సోదర సోదరీమణులందరికీ ఆయన హృదయపూర్వక విప్లవాత్మక వందనాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ మాట్లాడుతూ.. గిరిజనులకు ఈరోజు ఒక ఆత్మగౌరవ దినమని కొనియాడారు. ఆనాడు లంబాడి, ఎరుకల, యానాది అనే మూడు వెనుకబడిన కులాల దయనీయ జీవన స్థితిగతులను గుర్తించి, వారిని చట్టబద్ధంగా షెడ్యూల్డ్ తెగలుగా గుర్తించిన ఘనత దివంగత ప్రధాని, అపర దుర్గ శ్రీమతి ఇందిరా గాంధీకే దక్కుతుందని స్పష్టం చేశారు. ఆనాడు ఆమె తీసుకున్న చారిత్రక నిర్ణయమే నేడు గిరిజన సమాజం ఈ స్థాయిలో సమాజంలో గౌరవంగా బతకడానికి బలమైన పునాది వేసిందని గుర్తుచేశారు. ఇందిరమ్మ ఇచ్చిన హక్కులను, ఆత్మగౌరవాన్ని కాపాడుకుంటూనే.. నేటి తరం గిరిజన యువత విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో మరింతగా ఎదగాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. గిరిజన హక్కుల సాధన కోసం, జనాభా నిష్పత్తికి తగినట్లుగా న్యాయం జరిగేలా చూడటం కోసం మనమంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. బిజినపల్లి వేదికగా సాగుతున్న ఈ మహాయాత్ర గిరిజనుల ఐక్యతకు ప్రతీక అని, హక్కులను సాధించుకునే వరకు, ఆత్మగౌరవాన్ని కాపాడుకునే వరకు ఈ పోరాటం ఆగేది లేదని డా. చిక్కుడు వంశీకృష్ణ నొక్కి చెప్పారు. ఈ బహిరంగ సభలో గిరిజన సంఘాల నాయకులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.



## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి




- ఫీజులు రాక పేద విద్యార్థులు చదువులకు దూరం
- ఎస్ఎఫ్ఐ తాలూకా కన్వీనర్ చరణ్

**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్:** రాష్ట్రంలో గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ అచ్చంపేట తాలూకా కన్వీనర్ చరణ్ డిమాండ్ చేశారు. అచ్చంపేట పట్టణంలో రమేష్ అధ్యక్షతన నిర్వహించిన ఎస్ఎఫ్ఐ మండల కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా చరణ్ మాట్లాడుతూ... ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు సకాలంలో రాకపోవడం వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన నిరుపేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మారుతున్నా విద్యార్థుల సమస్యలు మాత్రం తీరడం లేదన్నారు. పాలకులకు గుళ్ళు, గోపురాలపై ఉన్న ప్రేమ.. పేద విద్యార్థుల చదువులపై లేకపోవడం దారుణమని మండిపడ్డారు. ప్రభుత్వం నుండి ఫీజులు రాకపోవడంతో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధిస్తున్నాయని చరణ్ ఆరోపించారు. బకాయిలు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని యాజమాన్యాలు పట్టుబట్టడంతో విద్యార్థులు పైచదువులకు, ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పెండింగ్ బకాయిలను తక్షణమే విడుదల చేసి పేద విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ అచ్చంపేట డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు, ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు రమేష్ నాయక్, చరణ్, చందర్, రాజు, గోపాల్, రవి, సురేష్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.